సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం ‌। 9 ।‌ అక్టోబర్ ।‌ 2024



ఊరు శిథిలం.. పేరు పదిలం

పెన్నాతీరంలో వెలసిన రొద్దం మండలం పెద్దమంతూరు గ్రామం ఇప్పుడు ఉనికి కోల్పోతోంది. క్రమ క్రమంగా ఊరు ఖాళీ అవుతోంది.

IIలో



కిలో టమాట రూ.50

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.50, కనిష్టంగా రూ.23, సరాసరిన రూ.35 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.3°/22.3°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై మంగళవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్యతో కలసి పాల్గొన్నారు. జిల్లాలో 230 పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాలు ఉన్నాయని, వీటన్నింటికీ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రికి కలెక్టర్ చేతన్ తెలిపారు. షెడ్యూల్ మేరకు అక్టోబర్ 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ధర్మవరం, పెనుకొండ, కదిరి ఆర్డీఓలు మహేష్, ఆనంద్, శర్మ, జలవనరుల శాఖ అధికారి గంగాధర్, డీఈ గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని వారికి ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇస్తోందని, ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 9 తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని 21వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలన్నారు. వివరాలకు పుట్టపర్తిలోని దీన జనోద్ధరణ బిల్డింగ్, బ్లాక్ నంబర్ 5లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. లేదా 9440412942 నంబర్లోనూ సంప్రదించవచ్చన్నారు.

సత్యసాయినామం.. శివశక్తి గానం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: శివస్వరూపాన్ని కొనియాడుతూ, సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. ప్రశాంతి నిలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో మూడో రోజు ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన ప్రశాంతి నిలయం క్యాంపస్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కేఎన్ నరేష్ దసరా వేడుకలను ఉద్దేశించి ప్రసంగించారు. నిత్య జీవితంలో భగవన్నామ స్మరణ వల్ల చేకూరే మంచిని వివరించారు. ఆ తర్వాత ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు శివశక్తి పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. శివ శక్తి స్వరూపాన్ని.. సత్యసాయి ప్రేమ, సేవా తత్వాన్ని వివరిస్తూ చక్కటి గీతాలతో భక్తులను మైమరపింపజేశారు. అనంతరం వారంతా సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.

మద్యం.. మాదే రాజ్యం

- మద్యం దుకాణాల కోసం 'పచ్చ' రుబాబు
- దక్కించుకునేందుకు ఎగబడుతున్న కూటమి నేతలు
- టెండర్ వేయకుండా వ్యాపారులకు బెదిరింపులు
- ఇప్పటికే దరఖాస్తు సమర్పించిన వారికీ వార్నింగ్
- లాటరీలో షాపు దక్కినా తమకే ఇవ్వాలంటూ హుకుం
- ఆలోచనలో పడిన ఔత్సాహికులు
- నేటి సాయంత్రం 5 గంటలతో ముగియనున్న దరఖాస్తు గడువు



పుట్టపర్తి టౌన్/ హిందూపురం అర్బన్: 'అధికారం మాది...అంతా మాదే.. మధ్యలో మీరేంది' అంటూ కూటమి పార్టీల నేతలు రెచ్చిపోతున్నారు. మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసే వ్యాపారులకు వార్నింగ్‌లు ఇస్తున్నారు. దరఖాస్తు చేసుకున్నా రూ.2 లక్షలు మీకే నష్టం జాగ్రత్త అంటూ హెచ్చరికలు పంపుతున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారికీ ఫోన్ చేసి భయపెడుతున్నారు. 'లాటరీలో షాపు మీకు దక్కినా... మాకే ఇవ్వాలి.. లేదంటే వ్యాపారం చేయలేరు' అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో మద్యం దుకాణాల దరఖాస్తుకు చాలా మంది ముందుకు రావడం లేదు.

87 దుకాణాలకు నోటిఫికేషన్

జిల్లాలో 87 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తు స్వీకరణకు అక్టోబరు 9వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 గంటల వరకూ గడువు విధించింది. మంగళవారం సాయంత్రం వరకు 454 దరఖాస్తులు అందాయి. ఒక్కో మద్యం షాపునకు 20 నుంచి 30 దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన జిల్లాలోని 87 మద్యం దుకాణాలకు అటుఇటుగా 2,000 దాకా దరఖాస్తులు వస్తాయని, ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున రూ. 40 కోట్ల ఆదాయం వస్తుందని భావించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 454 దరఖాస్తులు మాత్రమే అందాయి. అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడి చాలా మంది దరఖాస్తు చేయడం లేదని, అందువల్లే దరఖాస్తుల సంఖ్య తగ్గినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆదాయానికి 'తమ్ముళ్లే' తూట్లు పొడుస్తున్నారని ఎక్సైజ్ శాఖలోని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

పెనుకొండలో 'తమ్ముళ్ల' మధ్యే యుద్ధం

పెనుకొండలో మంత్రి సవిత , ఎంపీ పార్థసారథి అనుచరులు మద్యం దుకాణాల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఎంపీ పార్థసారథి వర్గీయులు పెనుకొండ నియోజకవర్గంలోని కొన్ని దుకాణాలకు సోమవారం దరఖాస్తు వేసేందుకు ప్రయత్నించగా.. మంత్రి అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు అడ్డుకొనే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసుల జోక్యంతో ఎంపీ అనుచరులు దరఖాస్తు చేశారు. దీంతో దరఖాస్తు చేసేందుకు వచ్చిన పలువురు 'టీడీపీ నేతలనే బెదిరిస్తున్నారు. ఇక మనల్ని వేయనిస్తారా' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం మద్యం దుకాణాలకు ఎవరైనా నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చని చెబుతున్నారు.

'పురం'లో ఎమ్మెల్యే పీఏ చెబితేనే...

హిందూపురంలో మద్యం దుకాణాల కోసం ఎమ్మెల్యే పీఏ చెప్పిన వారే దరఖాస్తు చేస్తున్నారు. దీంతో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు టీడీపీ నేతలే పలువురు వెనుకంజ వేస్తున్నారు. ఇక ఎమ్మెల్యే పీఏగా ఉన్న వ్యక్తి హల్‌చల్ చేస్తున్నారు. 'మేం ఎన్నికల్లో కోట్లు పోశాం.. అంతా కనుసన్నల్లోనే జరగాలి. కాదంటే దుకాణాలు ఎలా నడుపుతారో చూస్తాం' అంటూ బహిరంగంగానే బెదిరింపులకు దిగారు. ఒకవేళ టీడీపీ నేతలే ఎవరైనా షాపు దక్కించుకున్నా 20 శాతం పర్సెంటేజీ ఇవ్వాల్సిందే అంటున్నారు. దీనిపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మడకశిరలో సిండికేట్

మడకశిరలో మద్యం దుకాణాల కోసం అందరూ సిండికేట్ అయ్యారు. ఈ తతంగాన్ని అంతా నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నేత నడిపిస్తున్నారు. తమను కాదని ఆన్‌లైన్‌లో దరఖాస్తు వేసినా తీవ్ర పరిణామాలుంటాయని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై టీడీపీలోని మరో వర్గం గుర్రుగా ఉంది.

ఎవరికొచ్చినా వాటా ఇవ్వాల్సిందే

కదిరిలో ముఖ్య ప్రజాప్రతినిధి ఇంటి నుంచే మద్యం సిండికేట్ వ్యవహారం సాగుతోంది. మద్యం దుకాణాలకు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని సదరు ప్రజాప్రతినిధి చెప్పడంతో ఎవరికి వారు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఎవరికి దుకాణం దక్కినా వాటా ఇవ్వాల్సిందే అన్న సంకేతాలు ఇస్తున్నారు.

ధర్మవరంలో కూటమి నేతలదే హవా

ధర్మవరం నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పోటాపోటీగా దరఖాస్తు చేస్తున్నారు. తొలుత టీడీపీ వారే దరఖాస్తు చేసుకునేలా మంత్రాంగం నడిపారు. షాపు దక్కించుకున్న టీడీపీ నేతలు కూటమిలోని బీజేపీ, జనసేన నాయకులకు వాటాలిచ్చేలా ఒప్పందానికి వచ్చారు. కానీ ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ ఎవరికి వారుగా మూడు పార్టీల నేతలూ దరఖాస్తులు సమర్పిస్తున్నారు.

పుట్టపర్తిలో 'పల్లె' పెత్తనం

పుట్టపర్తి నియోజకవర్గంలో పల్లె రఘునాథరెడ్డి అనుచరుల హవా నడుస్తోంది. తాము తప్ప ఎవరూ టెండర్లు వేయడానికి వీల్లేదని చెబుతున్నారు. కాదూ కూడదని టెండర్ వేస్తే ఎలా షాపులు దక్కించుకుంటారో.. ఎలా నడుపుతారో చూస్తామని బహిరంగంగానే చెబుతున్నారు. దీంతో పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని మద్యం దుకాణాలకు టెండర్ వేసేందుకు వ్యాపారులు వెనుకంజ వేస్తున్నారు. ఒకవేళ ఆన్‌లైన్‌లో టెండర్ వేసి లాటరీలో షాపు దక్కించుకున్నా 30 శాతం వాటా ఇవ్వాలని చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఆలోచనలో పడిపోయారు. టెండర్ వేసేందుకు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

నేడే ఆఖరు..

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం సాయంత్రం 5 గంటల వరకూ అవకాశముంది. ఆఖరు రోజున ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తే సర్వర్ పనిచేయక సాంకేతిక సమస్యలొచ్చే అవకాశాలు ఎక్కువ. దీంతో దరఖాస్తులు ఉదయమే సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

కొత్తచెరువు దుకాణానికి 27 దరఖాస్తులు



జిల్లాలో కొత్త చెరువు మండలం షాపు నంబర్ 43కు అత్యధికంగా 27 దరఖాస్తులు అందాయి. ఆ తర్వాత అదే మండలంలోని 44వ నంబర్ షాపునకు 16 దరఖాస్తులు అందాయి. ఇక ఓడి చెరువులోని 11 నంబర్, పరిగిలోని 13 నంబర్, బుక్కపట్నంలోని 45 నంబర్ దుకానికి 14 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. పరిగిలోని 46వ మద్యం దుకాణానికి 10 దరఖాస్తులు అందాయి.

87	జిల్లాలో నోటిఫికేషన్ ఇచ్చిన మద్యం దుకాణాలు
రూ.2 లక్షలు	దరఖాస్తు చేసేందుకు చెల్లించాల్సిన రుసుం
454	మంగళవారం సాయంత్రం నాటికి అందిన దరఖాస్తులు
11	ఒక్క దరఖాస్తు అందని దుకాణాలు

11 దుకాణాలకు ఒక్క దరఖాస్తూ రాలేదు

జిల్లాలో 87 దుకాణాలకు మంగళవారం సాయంత్రానికి 454 దరఖాస్తులు అందాయి. దీంతో ప్రభుత్వానికి దరఖాస్తు రుసుం రూపంలో రూ.9,08,000,00 ఆదాయం సమకూరింది. అయితే జిల్లాలోని 10 దుకాణాలకు ఒక్కటంటే ఒక్క దరఖాస్తూ రాకపోవడం విశేషం. అందులో ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని షాపు నంబర్ 4, ధర్మవరం రూరల్‌లో 11, 12, 13 నంబర్ దుకాణాలు, ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలంలోని 15వ నంబర్ దుకాణం, హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 50, 53వ నంబర్ దుకాణాలు, మడకశిర నియోజకవర్గంలోని షాపు నంబర్ 80, 81, 84, గుడిబండ మండలంలోని 87 నంబర్ దుకాణాలు ఉన్నాయి.

పారదర్శకంగా మద్యం టెండర్లు



మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తాం. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తులు స్వీకరించే వెసులబాటు కల్పించింది. 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వచ్చే దరఖాస్తులన్నీ స్వీకరిస్తాం. 11వ తేదీ పుట్టపర్తిలో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తాం. లాటరీ తీయడాన్ని వీడియో రికార్డింగ్ చేస్తాం. మద్యం టెండర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపడుతున్నాం. వ్యాపారులు తమకు అనువైన ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

– నరసింహులు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

మంత్రి వర్సెస్ ఎంపీ

- పెనుకొండలో తారస్థాయికి వర్గపోరు
- ఆధిపత్యం కోసం మంత్రి ప్రయత్నాలు
- పట్టు నిలుపుకునేందుకు బీకే వ్యూహాలు



మంత్రి సవిత



ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ: మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి మధ్య వర్గపోరు తీవ్ర రూపం దాల్చుతోంది. సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందే ప్రారంభమైన ఈ వర్గపోరు ప్రస్తుతం ముదిరి పాకాన పడుతోంది. పెనుకొండ నియోజకవర్గంలో అన్నింటా ఆధిపత్యం చాటుకోవాలని మంత్రి ప్రయత్నిస్తుండగా.. పట్టు నిలుపుకోవాలని బీకే వ్యూహాలు పన్నుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోయి బాహాబాహీకి దిగే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇదివరకే ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవంతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడిగానూ ఉన్న బీకే పార్థసారథిని కాదని సవిత ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని గెలిచారు. మంత్రి పదవినీ దక్కించుకున్నారు. ప్రస్తుతం ఆమె నియోజకవర్గంలో తన వర్గాన్ని బలోపేతం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. చౌక దుకాణాల డీలర్‌షిప్పులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు, వివిధ పనులకు సంబంధించిన కాంట్రాక్టులు, పోలీసుస్టేషన్లో పంచాయితీలు ..ఇలా ప్రతి దాంట్లోనూ తన వర్గీయులకే పెద్దపీట వేస్తున్నారు. చివరకు ఉద్యోగుల బదిలీల్లోనూ తన మాటే నెగ్గేలా చూసుకున్నారు. ప్రస్తుతం మద్యం షాపుల టెండర్లలో సైతం ఎంపీ వర్గీయులు పాల్గొనకూడదంటూ మంత్రి వర్గీయులు అడ్డుపడుతున్నారు. ఈ క్రమంలోనే సోమవారం పెనుకొండ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఘర్షణ వాతావరణ తలెత్తింది.

పట్టు కోసం బీకే ప్రయత్నాలు

అన్నింటా తన పెత్తనమే సాగేలా మంత్రి సవిత వ్యవహరిస్తున్న తీరుపై ఎంపీ బీకేతో పాటు ఆయన వర్గీయులు రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో ఎలాగైనా తన పట్టు నిలుపుకోవాలని బీకే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మద్యం టెండర్లలో తన వర్గీయులను మంత్రి అనుచరులు అడ్డుకోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన.. పెనుకొండలోని తన స్వగృహంలో మకాం వేసి పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి తన వర్గీయులూ దరఖాస్తులు వేసేలా చొరవ తీసుకున్నారు. అన్ని షాపులూ తమకే దక్కుతాయని అప్పటి వరకు సంతోషంగా ఉన్న మంత్రి వర్గీయులు.. పోలీసుల సహకారంతో బీకే వర్గీయులు కూడా పోటీగా దరఖాస్తులు వేయడంతో కంగుతిన్నారు. ఈ వ్యవహారం మద్యం షాపులు కేటాయించేనాటికి ఎటు వెళుతుందోనని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

సామాజిక వర్గాలపై కన్ను

హిందూపురం ఎంపీగా గెలిచినప్పటికీ సొంత ఇలాకా పెనుకొండలో తన మార్కు రాజకీయం కొనసాగించడానికి బీకే పార్థసారథి పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం ఎంపీ ల్యాడ్స్ నిధులనే కాకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకువచ్చి పనులు చేపట్టాలన్న ఆలోచనలో ఉన్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. అలాగే బలమైన సామాజిక వర్గాల వారికి అవసరమైన పనులు చేసిపెట్టి.. వారి అండ కోసమూ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే పరిగిలో వాల్మీకి కల్యాణ మండపానికి రూ. కోటి, సోమందేపల్లిలో ఉప్పర (సగర) కులస్తుల కల్యాణ మండపానికి రూ.కోటి మంజూరు చేయించినట్లు చర్చ సాగుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన మంత్రి సవిత అనుచరులు సోమందేపల్లిలో స్థల వివాదం ముందుకు తీసుకురావడంతో శంకుస్థాపన ఆగిపోయింది. అనంతరం సగర కులస్తులు ఎంపీని కలసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలుస్తోంది.

నోరు మెదపని పార్టీ పెద్దలు

పెనుకొండ నియోజకవర్గంలో ఎంపీ బీకే, మంత్రి సవిత మధ్య వర్గ పోరు విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఇతర ముఖ్య నేతల దృష్టికి వెళ్లినా ఎవరూ నోరు మెదపడం లేదన్న చర్చ పార్టీ నాయకుల్లో సాగుతోంది. అయితే..ఇక్కడి పరిణామాలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

కదిరి మున్సిపల్ కమిషనర్‌పై వేటు

- మాతృశాఖకు పంపుతూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు



కమిషనర్ కిరణ్‌కుమార్

కదిరి: స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎం.కిరణ్‌కుమార్‌పై బదిలీ వేటు పడింది. ఆయన్ను తిరిగి మాతృశాఖ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు పంపారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అనిల్ కుమార్ సింఘాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కదిరి మున్సిపల్ కమిషనర్‌గా ఉంటూ కిరణ్‌కుమార్ ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కదిరి 36వ వార్డు కౌన్సిలర్ వి.అవేంద్ర అలియాస్ ఆవుల స్వామి ఇటీవల కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌లకు కూడా కిరణ్‌కుమార్ అక్రమాలపై పక్కా ఆధారాలతో అవేంద్ర ఫిర్యాదు చేశారు. దీనిపై రహస్యంగా ప్రాథమిక విచారణ జరిపిన ఉన్నతాధికారులు.. ప్రస్తుతానికి కిరణ్‌కుమార్‌ను మున్సిపల్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి మాతృశాఖకు పంపారు. మరింత లోతుగా విచారణ జరిపితే ఆయనపై సస్పెన్షన్ వేటు పడే అవకాశాలు కూడా మెండుగా ఉన్నాయని మున్సిపల్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం కదిరి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ గా ఉంది. త్వరలోనే ఇది సెలెక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ కానుంది. అదే జరిగితే ఇక్కడ కమిషనర్‌గా పని చేసేందుకు కిరణ్‌కుమార్ స్థాయి సరిపోదు. ఈ క్రమంలో ఆయన బదిలీ వ్యవహారం చర్చనీయాంశమైంది.

ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల్లో కొన్ని:

- మున్సిపల్ కాంట్రాక్టర్ల దగ్గర ప్రతి బిల్లుపై 10 శాతం కమీషన్ తీసుకోవడం. కమీషన్ ఇవ్వని కాంట్రాక్టర్లను వేధించడం.
- తనకున్న అధికారాలతో ఒక సచివాలయ ఉద్యోగిని డెప్యుటేషన్‌పై మున్సిపాలిటీకి బదిలీ చేసుకుని సర్వాధికారాలు కట్టబెట్టారు. రూ.1.50 కోట్ల విలువ చేసే డీసెల్, పెట్రోలు పక్కదారి పట్టించారు.
- మున్సిపల్ పరిధిలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్లు వేసే వారి దగ్గరే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకోవడం.
- మున్సిపాలిటీకి సంబంధం లేని చోటకు కూడా వెళ్లి డబ్బు డిమాండ్ చేయడం... డబ్బు ఇవ్వకపోతే నిబంధనలకు విరుద్ధంగా దారికి అడ్డంగా బారికేడ్లు వేయించి దారులు మూసివేయించడం.
- పట్టణంలోని వీధుల చివర.. పేద ప్రజలు బతుకుదెరువు కోసం వేసుకున్న బంకులను తీసివేయించడం, కట్టడాలను కూల్చివేయడం.
- తన అవినీతికి సహకరించని మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బందిని వేధించడం..ఇలా మున్సిపల్ కమిషనర్‌పై పలు ఆరోపణలు చేస్తూ 36వ వార్డు కౌన్సిలర్ అవేంద్ర ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

చిత్రావతికి జలకళ



నీటితో కళకళలాడుతున్న పెడపల్లి సమీపంలోని చెక్‌డ్యాం

పుట్టపర్తి అర్బన్: తాజా వర్షాలతో చిత్రావతి జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది తొలిసారిగా నీటితో కనువిందు చేస్తోంది. పుట్టపర్తి మండలం పైభాగాన కురుస్తున్న వర్షాలకు పెడపల్లి వద్ద ఉన్న ఆర్డీటీ చెక్‌డ్యాం కం కాజ్‌వే నిండుగా ప్రవహిస్తోంది. తీవ్ర వర్షాభావంతో ఏడాది కాలంగా చెక్‌డ్యాం నీళ్లు లేక వెలవెల బోయింది. ప్రస్తుతం పై ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీటితో కాజ్‌వేపై నీరు పారుతోంది. దీంతో సమీప ప్రాంతాల్లోనూ భూగర్భజల మట్టం పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిఖిలాంబికాదేవిగా హిందూపురం వాసవీమాత

లోకపావనీ నమోస్తుతే

దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాలు జిల్లాలో వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నిఖిల జగాలను ఏలే ఆ జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరాగా, ఆలయాలన్నీ కిటకిటలాడాయి. లోకపావనీ నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని కీర్తించారు. హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కాంతులు వెదజల్లాయి. దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి కదిరి లక్ష్మీనరసింహస్వామి పరమపద నాథ అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

– సాక్షి బృందం, శ్రీసత్యసాయి జిల్లా



పరమపదనాథ అలంకారంలో ఖాద్రీశుడు



మీనాక్షిదేవిగా ధర్మవరం సాలేవీధి పెద్దమ్మ

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు



పెన్నా నదిలో ఇసుక ట్రాక్టరును అడ్డుకుంటున్న రైతులు

రొద్దం: మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్రమ తరలింపుదారులు వాగ్వాదానికి దిగారు. అనుమతులు లేకుండా పెనుకొండ, సోమందేపల్లి, కర్నాటక తదితర ప్రాంతాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన తర్వాత స్థానిక పెన్నానది నుంచి భారీగా ఇసుకను తరలిస్తున్నారని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా... పోలీసులు అడ్డుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని, లేకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాని గ్రామస్తులు హెచ్చరించారు.

కర్ణాటక వాసి దుర్మరణం



మృతుడు తిప్పేస్వామి

అమరాపురం: మండలంలోని బసవనపల్లి అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి తిప్పేస్వామి (47) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... పావగడ తాలుకా నిడగల్లు హోబళి చిక్క తిమ్మనహట్టి గ్రామానికి చెందిన అంజినప్ప కుమారుడు తిప్పేస్వామి మడకశిర నుంచి తన స్వగ్రామానికి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. బసవనపల్లి అయ్యప్పస్వామి ఆలయం వద్దకు చేరుకోగానే ఆలదపల్లి నుంచి మడకశిర వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఘటనలో తిప్పేస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ రామాంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

రిమాండ్‌కు వంచకుడు

రాప్తాడు రూరల్: ప్రేమ పేరుతో వంచించిన ఓ యువకుడు చివరకు కటకటాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం రేగాటిపల్లికి చెందిన హనుమంతు బెంగళూరులో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురంలో తాను డిగ్రీ చదువుకునే సమయంలో పరిచయమైన రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమలోకి లాగాడు. పెళ్లి చేసుకుంటాననడంతో ఆ యువతి కూడా ప్రేమను అంగీకరించింది. డిగ్రీ పూర్తయిన తర్వాత సదరు యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్వేషణలో బెంగళూరుకు చేరుకుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న హనుమంతు పెళ్లి చేసుకుంటానని ఆశ పెట్టి పలుమార్లు శారీరకంగా ఆమెను వాడుకున్నాడు. చివరకు ఆమె ఇంటికి కూడా వచ్చి వెళ్లాడు. కొన్ని రోజులు గడిచిన తర్వాత హనుమంతు మొహం చాటేశాడు. పెళ్లి పేరు ఎత్తకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో మోసపోయినట్లుగా గుర్తించిన యువతి ఇటీవల ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ విజయకుమార్ మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఊరు శిథిలం.. పేరు పదిలం

- నిర్జన ప్రదేశంగా మారుతున్న పెద్దమంతూరు
- మరో ప్రాంతానికి తరలివెళుతున్న గ్రామస్తులు



పెద్దమంతూరులో శిథిలావస్థకు చేరిన ఇల్లు



నిర్మానుష్యంగా ఉన్న వీధి



రొద్దం: ఒకప్పుడు పెను ఉప్పెనలను తనలో కలుపుకుని తన హృదయాన్ని పదిల పరుచుకుని దాదాపు 300 కుటుంబాలకు పెన్నమ్మ ఓ ఆలంబనగా నిలిచింది. తన అస్తిత్వాన్ని చాటుకునే క్రమంలో ఏడాది పొడవునా పాడిపంటలతో అలరారేలా చేసింది. ఉదయం నిద్ర లేచింది మొదలు... పడుకునే వరకూ ఎంతో సందడిగా ఉండే ఆ గ్రామం కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా కనుమరుగైంది. ప్రస్తుతం అక్కడ గుర్తులు మాత్రమే మిగిలాయి. రొద్దం మండలం పెద్దమంతూరు గ్రామం కాలక్రమేణ నిర్జన ప్రదేశంగా మారింది. అయినా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం పేరు చెక్కుచెదరలేదు.

కూత వేటు దూరంలో పెన్నమ్మ గలగలలు

పెద్దమంతూరు గ్రామానికి కూతవేటు దూరంలో ఒకప్పుడు జీవనదిలా పెన్నానది ప్రవహిస్తూ ఉండేది. గ్రామం చుట్టూ పచ్చని పంట పొలాలు ఏడాది పొడవునా కనువిందు చేస్తుండేవి. పంటల సాగుతో పాటు పాడి పోషణలోనూ పెద్దమంతూరు గ్రామ ప్రజలు ముందజలో ఉండేవారు. కాలక్రమేణా పురాతన ఇళ్లన్నీ శిథిలం కావడం, ప్రత్యేక వాతావరణ పరిస్థితుల కారణంగా వ్యవసాయం భారమై కొందరు సమీప గ్రామానికి, మరి కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రస్తుతం అక్కడ ఓ 15 నుంచి 20 ఇళ్లు మాత్రమే ఉన్నాయి. సరైన జీవనోపాధులు లేక వారు అక్కడే దుర్భర జీవనం సాగిస్తున్నారు.

ఒకప్పుడు ఏటా జాతరలు

దశాబ్దాలకు పూర్వం పెద్దమంతూరులో ఏటా జాతరలు పెద్ద ఎత్తున జరిగేవి. పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని గ్రామస్తులు తమ ఇలవేల్పుగా కొలిచేవారు. ఈ క్రమంలో ఏటా క్రమం తప్పకుండా ఉట్ల జాతర, స్వామి రథోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసేవారు. పెద్దమంతూరుకు ఎగువన నాగలమడక వద్ద రిజర్వాయర్‌ను నిర్మించిన తర్వాత పరిస్థితుల్లో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఎప్పటికైనా పెన్నానది ఉగ్రరూపం దాలిస్తే గ్రామం మునుగుతుందన్న భావనతో అప్పటి ప్రభుత్వం గ్రామ సమీపంలో ఇళ్ల స్థలాలను కేటాయించింది. దీంతో ఒక్కో కుటుంబం గ్రామానికి దూరమవుతూ వచ్చింది. గ్రామం మునుగుతుందన్న ఆందోళనతో కొందరు, గ్రామ సమీపంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందంటూ మరికొందరు గ్రామాన్ని విడిచి పోయారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా కరువు ఛాయలు నెలకొనడంతో పంటల సాగును వదులుకుని బతుకు తెరువు మరికొందరు వలస బాట పట్టారు. దీంతో క్రమేణ గ్రామం కనుమరుగవుతూ వచ్చింది.

పదేళ్ల క్రితమే వచ్చేశాం



మా పూర్వీకులు అందరూ పెద్దమంతూరులోనే ఉండేవారు. పదేళ్ల క్రితం గ్రామంలోని చాలా మంది పి.రొప్పాలకు వలస వచ్చి నివాసం ఏర్పరుచుకున్నారు. ఆ సమయంలోనే మా పెద్దలు కూడా ఇక్కడకు వలస వచ్చారు. మా జీవనం ఇక్కడే ఉన్నా... వ్యవసాయ పనులకు మాత్రం పెద్దమంతూరుకు వెళ్లి వస్తుంటాం.

– రంగప్ప, రొప్పాల

ఏరు పారితే ఇబ్బందని..



నా చిన్నప్పుడు పెద్దమంతూరులో ఎంతో సందడి ఉండేది. గ్రామానికి అనుకుని పెన్నానది ప్రవహిస్తూ ఉండేది. గతంలో నెలల తరబడి ఏరు పారేది. దీనికి తోడు ఎగువన ప్రాజెక్ట్‌లు నిర్మించారు. దీంతో ఎప్పటికైనా గ్రామం మునుగుతుందనే భయంతో చాలా మంది పెద్దమంతూరు వదిలి రొప్పాలకు చేరుకున్నారు. కొంతమంది మాత్రమే ఇప్పటికీ గ్రామంలోనే నివాసముంటున్నారు. అందులో మా కుటుంబం కూడా ఒక్కటి. చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

– నల్లప్ప, పెద్దమంతూరు

30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి

- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలను కూటమి ప్రభుత్వం అడియాశలు చేస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 27 శాతం ఐఆర్ ప్రకటించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఐఆర్ ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. తక్షణమే 12వ పీఆర్సీ కమిషన్ వేసి ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు చెల్లించాలని జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీధర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, వెంకటరమణ, గోపాల్, కృష్ణా నాయక్, హెచ్. రామకృష్ణ, విశ్వనాథరెడ్డి, వెంకటరెడ్డి, ఓబిరెడ్డి, శంకరనారాయణ, రవీంద్రారెడ్డి, శంకరనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ నేతలు రూ.50 లక్షలు అడిగారు

- 15 ప్లాట్లు ఇవ్వాలని బెదిరించారు
- ఒప్పుకోకపోవడంతో పునాదులు, షెడ్లు కూల్చేశారు
- ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ నేతలు



మాట్లాడుతున్న ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర

ధర్మవరం అర్బన్: '' పట్టణంలోని సర్వే నంబర్ 650–2లో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ సభ్యులకు ప్రభుత్వం గతంలో స్థలం కేటాయించింది. అందులో కొందరు ఇళ్లు కట్టుకునేందుకు పునాదులు తవ్వుకున్నారు. మరికొందరు షెడ్లు వేసుకుని ఉంటున్నారు. ఇటీవల కొందరు బీజేపీ నాయకులు వచ్చి తమకు రూ.50 లక్షల నగదు 15 ప్లాట్లు ఇవ్వాలని మమ్మల్ని బెదిరించారు. మేము ఒప్పుకోకపోవడంతో మా ఇళ్ల పునాదులు, షెడ్లు కూల్చేశారు'' అని ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేంద్ర, కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి లదీస్, ట్రెజరర్ ఇస్మాయిల్ తదితరులు పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 650–2లోని స్థలం గత 15 ఏళ్లుగా వివాదంలో ఉంది. 2023లో కోర్టు మా అసోసియేషన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న ప్లంబర్లు ప్లాట్లు వేసుకుని పునాదులు తీసుకుంటున్నారు. మరికొంతమంది రేకుల షెడ్లు వేసుకున్నారని తెలిపారు. అయితే బీజేపీ నాయకులైన గొడుగు నాగరాజు, సోమశేఖర్, బాలకృష్ణయాదవ్ తదితరులు వచ్చి రూ.50 లక్షల నగదు, 15 ప్లాట్లు ఇవ్వాలని తమను బెదిరించారన్నారు. తాము అందుకు ఒప్పుకోకపోవడంతో దౌర్జన్యంగా హిటాచీతో పునాదులు, పిల్లర్లు, షెడ్లు కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దురుద్దేశంతో ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు కాని వారితో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. రాజకీయ ప్రోద్బలంతో నిజమైన ప్లంబర్లకు కేటాయించిన ప్లాట్లను దౌర్జన్యంగా లాక్కోవాలని చూస్తున్నారని వాపోయారు. తాము అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని 15 ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చామని, ఇన్నేళ్లూ రాని వారు ఇప్పుడు ప్లంబర్ల పేరుతో బీజేపీ నాయకులతో కలిసి దౌర్జన్యంగా చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు జుబేర్, జావీద్, చంద్ర, వీరారెడ్డి, అంజి, కిష్ట, మాధవ్, జిలాన్, బాషా, ఆంజనేయులు, హసీమ్, అనిల్‌కుమార్, అజయ్‌కుమార్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు సురేష్‌నాయక్

పుట్టపర్తి అర్బన్: కుటుంబకలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.... పుట్టపర్తి మండలం బడేనాయక్ తండాకు చెందిన సరస్వతీబాయి తన భర్త చనిపోయిన తర్వాత అదే గ్రామానికి చెందిన సురేష్ నాయక్ (28)ను రెండో పెళ్లి చేసుకుంది. అప్పటికే ఆమెకు మొదటి భర్త ద్వారా ఓ కుమార్తె ఉంది. సురేష్ నాయక్‌తో పెళ్లి తర్వాత ఓ కుమారుడు, కుమార్తె జన్మించారు. ముగ్గురు పిల్లలతో కలసి ఒకే ఇంట్లో ఎంతో సఖ్యతగా జీవిస్తుండేవాడు. ప్రశాంతి గ్రామం వద్ద బంక్‌లో కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య సఖ్యత లోపించి తరచూ గొడవ పడేవారు. సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని 10.30 గంటలకు ఇంటికి చేరుకున్న దంపతులు... భోజనం తర్వాత చిన్నపాటి విషయానికి ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన సురేష్ నాయక్ అర్ధ రాత్రి సమయంలో ఇంట్లో అందరూ గాఢ నిద్రలో ఉండగా, అదే గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున నిద్ర లేచిన కుటుంబసభ్యులు... అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న సురేష్‌నాయక్‌ను చూసి బోరున విలపించారు. తండ్రి దూబే నాయ్, తల్లి తావ్రీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పుట్టపర్తి రూరల్ పీఎస్ ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా – ఇద్దరు కూలీల మృతి



మృతుడు సునీల్

తలుపుల: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... ఎన్పీకుంట మండలం గోకనపేట వద్ద చేపట్టిన నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులకు అవసరమైన సామగ్రిని తీసుకుని మంగళవారం ట్రాక్టర్‌లో జార్ఖండ్‌కు చెందిన పలువురు కూలీలు బయలుదేరారు. తలుపుల మండలం గెరికపల్లి సమీపంలో ఉన్న పొలిమేర గంగమ్మ మిట్ట వద్దకు చేరుకోగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో జార్ఖండ్‌కు చెందిన కూలీలు సునీల్ (28), ధనియాల్(29) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దౌర్జన్యంగా పంట దున్నేశారు



దున్నేసిన కంది చేను చూపుతున్న బాధిత రైతులు

ఎన్పీకుంట: మండలంలోని బందారు చెట్లపల్లి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మీనారాయణ సోదరులు దాదాపు 5 ఎకరాల్లో సాగు చేసిన కంది పంటను టీడీపీ నాయకులు మంగళవారం దౌర్జన్యంగా దున్నేశారు. బాధితులు తెలిపిన మేరకు... ధనియానిచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 186లో 10.59 ఎకరాలు, 190 లో 7.50 ఎకరాల పొలానికి సంబంధించి గడ్డం లక్ష్మీనారాయణ, ఆయన సోదరులు గడ్డం రామకృష్ణ, గడ్డం నారాయణ పేరుతో ఒక్కొక్కరికి 6 ఎకరాలు చొప్పున పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయి. ఇందులో మూడు నెలల క్రితం ముగ్గురు అన్నదమ్ములు కంది పంట సాగు చేశారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెద్ద రెడ్డప్ప, చిన్న రెడ్డప్ప, నాగముని, బాలరాజు, శ్రీరాములు, ఈశ్వరయ్య, శ్రీనివాసులు ఎలాగైనా ఆ భూమిని దక్కించుకోవాలనే కుట్రతో మంగళవారం ట్రాక్టర్లను ఏర్పాటు చేసి కంది పంటను దున్నేశారు. ఆ సమయంలో అడ్డుకోబోయిన మహిళలను అసభ్యపదజాలంతో దుర్భాషలాడుతూ దౌర్జన్యానికి దిగారు. ఈ పొలం విషయమై గతంలో ఆర్డీఓ కోర్టులో వివాదం నడిచిందని, నాలుగు నెలల క్రితం కోర్టు తమకు అనుకూలంగా ఐఓ కూడా ఇచ్చిందని బాధితులు తెలిపారు. దీని ఆధారంగానే తాము పొలంలో విత్తు వేశామన్నారు. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అధికారులు రికార్డులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

మహిళ దారుణ హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అమడగూరు: తోటలో కాపలాగా ఉన్న మహిళను గుర్తు తెలియని దుండగులు కిరాతకంగా హతమార్చిన ఘటన అమడగూరు మండలంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... అమడగూరు మండలం మహమ్మదాబాద్‌కు చెందిన ఏఎస్‌ఐ కృష్ణమూర్తి ఉద్యోగరీత్యా విజయవాడలో నివాసముంటున్నారు. గ్రామానికి దూరంగా కొండ సమీపంలో ఉన్న తన తోటకు కాపలాగా ఏడాది క్రితం పెనుకొండకు చెందిన రామలక్ష్మమ్మ (50)ను నియమించారు. ఈ క్రమంలో రామలక్ష్మమ్మ తోటలోనే నివాసముంటూ వచ్చింది. ఆమె కుమారుడు పురుషోత్తం కదిరిలో బేల్దారి పనులకు వెళ్లేవాడు. మంగళవారం పురుషోత్తం తన తల్లికి పలుమార్లు ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో తోట వద్దకు చేరుకున్నాడు. అప్పటికే రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉన్న తల్లిని గమనించి బోరున విలపిస్తూ విషయాన్ని చేరవేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శివనారాయణ స్వామి, ప్రత్యేక దర్యాప్తు బృందం అక్కడకు చేరుకుని పరిశీలించారు. రెండు రోజులు క్రితమే ఆమెను దుండగులు హతమార్చినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించి హంతకుల ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సైతం అక్కడకు చేరుకుని పరిశీలించారు. రెండు క్రితం శనివారం తాము రామలక్ష్మమ్మను చూసినట్లుగా గ్రామస్తులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఆమె హత్యకు గత కారణాలు తెలియాల్సి ఉంది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.